ఇందిరమ్మ ఇండ్లు వచ్చేనా?

తెలంగాణలో ఇండ్ల పథకానికి 'ఇందిరమ్మ' పేరుపై కేంద్రంలోని బీజేపీ సర్కార్ విముఖత

పేరు మార్చితేనే నిధులన్న కేంద్రమంత్రి బండి ● రాష్ట్రాల్లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజనకు అనుబంధంగానే గృహనిర్మాణ పథకాలు

- **వ్యక్తుల పేరు లేకుండానే హౌసింగ్ స్కీమ్‌లు**
- **కేంద్ర చిహ్నం పెట్టేందుకు సిద్ధమేనని ఇదివరకే ప్రకటించిన రాష్ట్ర సర్కారు**
- **'ఇందిరమ్మ' పేరుంటే నిధులిచ్చేది లేదు**
- **కార్డుపై మోదీ ఫొటో లేకుంటే రేషన్ ఇవ్వం**
- **గ్రీన్‌కో నుంచి డబ్బులు తీసుకోలేదని ప్రమాణం చేస్తవా?: సీఎంకు బండి సవాల్**

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ) : 'గరీబుల ఇండ్లకు ఇందిరమ్మ పేరు అడ్డంకిగా మారనున్నదా?' అంటే.. బీజేపీ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలనుబట్టి 'అవును' అనే అనిపిస్తున్నది. ఇతర రాష్ర్టాల్లో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో పేదల గృహనిర్మాణ పథకానికి ఇందిరమ్మ పేరు ఖరారు చేయడం వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ రాష్ట్ర పర్యటన ముగించుకొని వెళ్లిన మరుసటి రోజే ఈ అంశం తెరపైకి రావడం పలు సందేహాలకు తావిస్తున్నది. రాష్ట్ర పర్యటన సందర్భంగా ఖట్టర్ ఇందిరమ్మ పేరుపై అభ్యంతరం వ్యక్తం చేశారని, అందుకే బండి సంజయ్ దీనిపై మాట్లాడారనే ప్రచారం జరుగుతున్నది.

పీఎంఏవైకి అనుబంధంగానే..

దేశంలోని దాదాపు అన్ని రాష్ర్టాల్లో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై)కి అనుబంధంగానే వివిధ పేర్లతో గృహనిర్మాణ పథకాలు అమలవుతున్నాయి. తెలంగాణలోనూ పీఎంఏవైకి అనుబంధంగానే ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. గతంలో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో ఉమ్మడి రాష్ట్రంలో ఇందిరమ్మ పేరును ఖరారు చేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత పదేండ్లపాటు ఇక్కడ బీఆర్‌ఎస్ అధికారంలో కొనసాగింది. కేంద్రంలో పదేండ్ల నుంచి ఎన్డీఏ సర్కారు కొనసాగుతున్నది. మరోవైపు దేశంలో కాంగ్రెస్ పార్టీ రెండు మూడు రాష్ర్టాలకే పరిమితమైంది. ఈ నేపథ్యంలో కేంద్రంలోని ఎన్డీఏ సర్కారు సహకారంతో తెలంగాణలో చేపట్టే గృహనిర్మాణ పథకానికి ఇందిరమ్మ పేరు పెట్టడం వివాదాస్పదమైంది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌తోపాటు విపక్ష పార్టీలైన ఆప్, టీఎంసీ అధికారంలో ఉన్న రాష్ర్టాల్లోనూ గృహనిర్మాణ పథకాలకు నేతల పేర్లు పెట్టకపోవడం గమనార్హం

కేంద్రమంత్రి వెళ్లిన మరుసటిరోజే వివాదం

తాజాగా శుక్రవారం కేంద్రమంత్రి కట్టర్ రాష్ట్ర పర్యటనకు రాగా రాష్ర్టానికి 20 లక్షల గృహాలు మంజూరు చేయాలని సీఎం సహా రాష్ట్ర మంత్రులు ఆయనకు విజ్ఞప్తిచేశారు. శనివారం రాష్ర్టానికి చెందిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కరీంనగర్‌లో ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ గృహనిర్మాణ పథకానికి ఇందిరమ్మ పేరు పెడితే కేంద్రం నుంచి నిధులు ఇచ్చేది లేదని స్పష్టంచేశారు. దీంతో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలుపై సర్వత్రా సందేహాలు తలెత్తుతున్నాయి. ఇందిరమ్మ పేరు పెట్టడంపై కేంద్రమంత్రి ఖట్టర్ అభ్యంతరం వ్యక్తం చేసినందునే బండి సంజయ్ ఇలా వ్యాఖ్యానించారనే ప్రచారం జరుగుతున్నది. ఒకవేళ ఇదే నిజమైతే ఇందిరమ్మ పేరు మార్చనంతవరకు వివిధ కారణాలతో కేంద్రం నుంచి నిధులు విడుదలయ్యే అవకాశం ఉండదని, ఒకవేళ నిధులు వచ్చినా అరకొరగానే వస్తాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. కేంద్ర నిధులతో పథకాన్ని అమలు చేస్తున్నందున ఇండ్లపై కేంద్ర ప్రభుత్వ చిహ్నం పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్టు రాష్ట్ర సర్కారు ఇదివరకే ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ చిహ్నం పెడితే వివాదం లేకుండా పథకం అమలయ్యే అవకాశమున్నది. అలాకాకుండా నాయకుల పేర్లో, లేక కాంగ్రెస్ రంగులో ఇండ్లకు వేస్తే ఇబ్బందులు తప్పవని రాజకీయవర్గాలు హెచ్చరిస్తున్నాయి.

కేంద్రం మార్గదర్శకాల ప్రకారమే లబ్ధిదారుల ఎంపిక

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక సైతం కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే జరుగుతున్నది. ఈ మేరకు అత్యంత నిరుపేదలకు మాత్రమే ఇండ్లు మంజూరయ్యే అవకాశమున్నది. రాష్ట్ర ప్రభుత్వం చెప్తున్న విధంగా లక్షలాదిమందికి ఇండ్లు వచ్చే అవకాశం లేదని సాక్షాత్తూ అధికారవర్గాలే చెప్తున్నాయి. మరోవైపు, ఏడాది గడిచినా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలుకు నోచుకోకపోగా తాజాగా ఫిబ్రవరిలో అర్హుల జాబితా ప్రకటిస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ఇందిరమ్మ పేరు ఉంటే కేంద్ర నిధులు ఇచ్చేదిలేదని బండి సంజయ్ వ్యాఖ్యానించిన వెంటనే మంత్రి పొంగులేటి ప్రకటన రావడం విశేషం. దీన్నిబట్టి ఇందిరమ్మ ఇండ్ల పథకం పేరు మార్పు తప్పదని, సొంతింటి కోసం పేదలు మరికొంత కాలం వేచిచూడక తప్పదని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తున్నది.

వివిధ రాష్ట్రాల్లో గృహనిర్మాణ పథకాల పేర్లు ఇలా..

- **కర్ణాటకలో:** ఆశ్రయ యోజన (బసవ వసతి యోజనా)
- **తమిళనాడు:** తమిళనాడు హౌసింగ్ బోర్డ్ స్కీమ్ (టీఎన్‌హెచ్‌బీ)
- **మహారాష్ట్ర:** సీఐడీసీవో (సిటీ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) లాటరీ స్కీమ్
- **ఆంధ్రప్రదేశ్:** మన ఇల్లు.. మన గౌరవం (హౌసింగ్ ఫర్ ఆల్ స్కీమ్)
- **ఉత్తరప్రదేశ్:** ఉత్తరప్రదేశ్ ఆవాస్ వికాస్ యోజన
- **హిమాచల్ ప్రదేశ్:** స్వరన్ జయంతి ఆశ్రయ్ యోజన
- **ఢిల్లీ ఎన్‌సీఆర్:** 'డీడీఏ (ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ) సస్తా ఘర్ హౌసింగ్ స్కీమ్
- **మధ్యప్రదేశ్:** లాడ్లీ బహెనా హౌసింగ్ స్కీమ్
- **హర్యానా:** హర్యానా హౌసింగ్‌బోర్డ్ స్కీమ్
- **పశ్చిమ బెంగాల్:** నిజశ్రీ హౌసింగ్ స్కీమ్

'ఇందిరమ్మ' పేరు పెడితే నిధులివ్వం

- **రేషన్‌కార్డుపై మోదీ ఫొటో ఉండకపోతే రేషన్ ఇవ్వం: బండి**

కరీంనగర్, జనవరి 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రధానమంత్రి ఆవాస్ యోజన పేరుతో కేంద్రం మంజూరు చేసే ఇండ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ పేరు పెడతామంటే ఒక్క ఇల్లు కూడా మంజూరు చేసే ప్రసక్తే లేదని, కేంద్రం నుంచి నిధులు ఇచ్చేదే లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం కరీంనగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద కేంద్రం ఇండ్లు మంజూరు చేస్తది.. వాటికి ఇందిరమ్మ అని పేరు పెడితే కేంద్రం నుంచి పైసా కూడా రాదు రాసి పెట్టుకోండి' అంటూ రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశారు. రేషన్‌కార్డుల్లో ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇందిరమ్మ ఫొటో ఉండి ప్రధాని ఫొటో లేకుంటే రేషన్ ఇచ్చేది లేదని స్పష్టంచేశారు. 'గ్రీన్‌కో సంస్థపై ఏసీబీ దాడులు చేసి విచారణ చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెప్తున్నది.. నేను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సవాల్ చేస్తున్న.. గ్రీన్‌కో సంస్థ నుంచి కాంగ్రెస్‌కు పైసలు ముట్టినయా? లేదా? ముట్టలేదని ప్రమాణం చేస్తావా?' అంటూ బండి సవాల్ విసిరారు. బీజేపీ సహా అన్ని పార్టీలూ డబ్బులు తీసుకుంటాయని, పార్టీలు నడపాలంటే వాళ్లు.. వీళ్ల సహకరిస్తేనే సాధ్యమని, అంతేకాని..జేబులనుంచి ఎవరూ డబ్బులు పెట్టలేరని చెప్పారు. గ్రీన్‌కో సంస్థ ప్రజలకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలు చేస్తున్నదని, తద్వారా తెలంగాణకు ఆదాయం వస్తున్నదని, ఇలాంటి సంస్థలపై దాడులు చేయడం వల్ల ఆ సంస్థలు తెలంగాణను విడిచిపెట్టి ఇతర రాష్ర్టాలకు వెళ్తాయని ఆందోళన వ్యక్తంచేశారు.

పేదలకు అమెరికాలో ఉచిత విద్య

- **కాగ్నిజెంట్ ఫిలాంత్రోఫిస్ సంస్థ స్పాన్సర్‌షిప్**

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): పేద విద్యార్థులకు అమెరికాలో ఉచిత విద్య అందించనున్నట్టు భారత్, యూఎస్ వర్క్‌ఫోర్స్ భాగస్వామి, ముర్లీ సెంటర్డ్ ప్రాజెక్ట్ హెడ్ ప్రొఫెసర్ అనంత సుధాకర్ బాబ్బిలి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ తొలుత 15 మంది విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తామని పేర్కొన్నారు. ఇందుకు కాగ్నిజెంట్ ఫిలాంత్రోఫిస్ సంస్థ, 1200 అమెరికన్ కమ్యూనిటీ కాలేజీల ప్రాతినిధ్యం వహించే అసోసియేషన్ ఆఫ్ కమ్యూనిటీ కాలేజీ ట్రస్టీస్, భారత రాయబార కార్యాలయం మద్దతునిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీతోపాటు, లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కాలేజీ, బాయ్స్ టౌన్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌తో ఎంవోయూ కుదుర్చుకున్నట్టు తెలిపారు.

'ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలుచేయాలి'

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ) : టీచర్ల ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలుచేసి పదోన్నతులు కల్పించాలని పీఆర్టీయూ టీఎస్ ప్రభుత్వాన్ని కోరింది. శనివారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి, ప్రతినిధులు విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణాను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

సర్కారు కాలేజీల్లో స్టడీ అవర్స్

- **ఉదయం, సాయంత్రం నిర్వహణ**

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ) : సర్కారు జూనియర్ కాలేజీల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు స్టడీ అవర్స్‌ను నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండుపూటలా స్టడీ అవర్స్‌ను నిర్వహించి, పర్యవేక్షించాలని ఇంటర్‌బోర్డు డైరెక్టర్ క్రిష్ణ ఆదిత్య ఆదేశించారు. శనివారం నాంపల్లి ఇంటర్‌బోర్డు కార్యాలయంలో డిస్ట్రిక్ట్ అకడమిక్ మానిటరింగ్ సెల్ పనితీరుపై ఓరియంటేషన్ నిర్వహించారు. విద్యార్థులు, సిబ్బంది హాజరును పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో ఆర్జేడీలు జయప్రదాబాయి, వెంకన్యానాయక్, లక్ష్మారెడ్డి, జయమణి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి కోసం ధర్నా

- **అర్హుల జాబితాలో పేరు లేకపోవడంతో ఆందోళన**
- **సర్వే జాబితాలో అవకతవకలు జరిగాయని ఆరోపణ**

ఖమ్మంలోని చింతకాని మండలం పందిళ్లపల్లిలో ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న ఆదినారాయణ

మధిర(చింతకాని), జనవరి 25: ఖమ్మం జిల్లా చింతకాని మండలం పందిళ్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని నల్లగొండ ఆదినారాయణ ప్లకార్డుతో ఖమ్మం-బోనకల్లు ప్రధాన రహదారిపై శనివారం ధర్నాకు దిగాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ గ్రామసభ జాబితాలో తన పేరు లేదని ఆవేదన వ్యక్తంచేశాడు. అధికారులు చేపట్టిన ఇంటింటి సర్వేలో అనేక అవకతవకలు జరిగాయని, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలు రాలేదని వాపోయాడు.

యూపీఎస్ వద్దు.. ఓపీఎస్సే ముద్దు

- **ఎన్‌ఎంవోపీఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ**

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యూపీఎస్)ను ఒప్పుకోబోమని.. పాత ఓల్డ్ పెన్షన్ స్కీంను తిరిగి పునఃరుద్ధరించాలని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్‌ఎంవోపీఎస్) సెక్రటరీ జనరల్ గంగాపురం స్థితప్రజ్ఞ స్పష్టంచేశారు. ఏప్రిల్ 1 నుంచి కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు యూనిఫైడ్ పెన్షన్ స్కీంను అమలుచేసేందుకు శనివారం కేంద్ర ఆర్థికశాఖ గెజిట్ విడుదల చేసిం ది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూపీఎస్‌తో నేషనల్ పెన్షన్ ట్రస్ట్‌లో జమ అయిన 10.5లక్షల కోట్లు కార్పొరేట్ల చేతుల్లోకి వెళతాయని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు యూపీఎస్‌ను తీవ్రంగా వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

జీవో 46 బాధితులకు న్యాయం చేయాలి

- **15వేల పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వండి**
- **సర్కారుకు నిరుద్యోగుల డిమాండ్**

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ) : జీవో నంబర్ 46ను రద్దుచేసి న్యాయం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తమ జీవితాలతో ఆడుకున్నదని నిరుద్యోగులు మండిపడుతున్నారు. తక్షణమే 15వేల పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని, లేకపోతే జీవో 46తో నష్టపోయిన తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాధితులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చాలామంది కొత్త నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని బాధితుడు ఆకాశ్ తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2018లో 15వేల ఉద్యోగాలు, 2022లో 16వేల పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చినట్టు గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణ పేరిట కాలయాపన చేయకుండా వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగార్థుల వయస్సును 35 ఏండ్లకు పెంచాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఇచ్చినట్టుగానే 15 వేల కానిస్టేబుల్, వెయ్యి ఎస్సై జాబ్‌లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఫార్ములా ఈ ఆపరేషన్స్‌సీఈవోకు ఏసీబీ నోటీసులు

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): ఫార్ములా ఈ-రేస్ కేసులో ఏసీబీ దర్యాప్తు కొనసాగుతున్నది. తాజాగా ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్‌ఈవో) కంపెనీ సీఈవో జెఫ్ డాడ్స్‌కు ఏసీబీ నోటీసులు ఇచ్చింది. వచ్చేవారం విచారణకు రావాలని కోరింది. ఏసీబీ నోటీసులపై జెఫ్ డాడ్స్ స్పందించారు. విచారణకు వచ్చేందుకు తనకు నాలుగు వారాల సమయం కావాలని కోరారు. దీంతో ఏసీబీ అధికారులు అంగీకరించారు.

హనుమకొండలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, చిత్రంలో దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్

గ్రామాల్లో దౌర్జన్య సభలు

- **స్థానిక సంస్థల ఎన్నికల ముందు కాంగ్రెస్ జిమ్మిక్కులు**
- **అబద్ధపు మాటలతో ప్రజలను మోసం చేస్తున్న సీఎం**
- **కాంగ్రెస్ కార్యకర్తల్లా పోలీసుల వ్యవహారం**
- **రుణమాఫీలో సీఎం, మంత్రుల మాటలకు పొంతన లేదు**
- **మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్**

హనుమకొండ, జనవరి 25 : కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలు దౌర్జన్యసభలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల ముందు కాంగ్రెస్ ఆడుతున్న జిమ్మిక్కులని విమర్శించారు. శనివారం హనుమకొండలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్‌తో కలిసి మాట్లాడారు. గ్రామసభల్లో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇల్లు వస్తాయని ప్రజలు ఆశతో వస్తే మళ్లీ దరఖాస్తులు స్వీకరించారు, కానీ ఇప్పటివరకు ఒక్క లబ్ధిదారుడిని ఎంపిక చేయలేదన్నారు. అన్నింటా రాష్ట్ర ప్రభుత్వం ఫెయిల్ అయ్యిందని, ఇందుకు నిదర్శనం గ్రామసభల్లో ప్రజలు నిలదీయడం, నిరసనలేనని చెప్పారు. రుణమాఫీ విషయంలో సీఎం, మంత్రుల మాటలకు పొంతన లేదని పేర్కొన్నారు. దావోస్ పెట్టుబడులు శుద్ధఅబద్ధమని, రేవంత్‌రెడ్డి మాటలు బోగస్ అని ధ్వజమెత్తారు. ప్రజలను మోసం చేయాలని చూస్తున్న రేవంత్‌రెడ్డిని ప్రజలు ఉరికించి కొడతారని తెలిపారు. పోలీసులను, అధికారులను కార్యకర్తలుగా వాడుకుంటున్నారని మండిపడ్డారు. టెక్స్‌టైల్ పార్కు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తలేదని అధికారులే అంటున్నారని పేర్కొన్నారు.

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పక్కన బీఆర్‌ఎస్ నాయకులు బాలమల్లు, బొమ్మెర రామ్మూర్తి, భాస్కర్

కార్యకర్తలకే పథకాలిస్తే గ్రామసభలెందుకు?

- **సీఎం మాటలు నీటిమూటలు**
- **పథకాల అమలుపై మంత్రుల తలోమాట**
- **సర్కారుపై తిరగబడుతున్న జనం**
- **ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఫైర్**

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ కార్యకర్తలకే పథకాలు ఇచ్చే ఉద్దేశమున్నప్పుడు గ్రామసభలు నిర్వహించి సామాన్యులను ఇబ్బంది పెట్టడమెందుకని ఎమ్మెల్సీ శంభీర్‌పూర్ రాజు ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలు నీటిమూటలయ్యాయని విరుచుకుపడ్డారు. పథకాల అమలుపై మంత్రులు తలోమాట మాట్లాడుతూ గందరగోళం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో శనివారం బీఆర్‌ఎస్ నాయకులు గ్యాదరి బాలమల్లు, బొమ్మెర రామ్మూర్తి, గుడాల భాస్కర్‌తో కలిసి శంభీపూర్ రాజు విలేకరులతో మాట్లాడారు. హామీల అమల్లో కాంగ్రెస్ విఫలమైందని విమర్శించారు. దరఖాస్తుల పేరిట ప్రజలను ఇబ్బంది పెడుతున్నదని దుయ్యబట్టారు. ప్రజలు తిరగబడుతుంటే మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు కాంగ్రెస్ నాయకుల వీపులపై విమానం మోత మోగిస్తున్నారని తెలిపారు. ఆ నొప్పులు తగ్గించుకొనేందుకు వారికి బీఆర్‌ఎస్ తరపున జిందాతిలిస్మత్, ఝండూబాం పంపిస్తున్నామని ఎద్దేవా చేశారు.

సర్కార్ గుండెల్లో పల్లె మంట

- **ఊరూరా ఉప్పెనలా జనాగ్రహం**
- **గ్రామసభల సాక్షిగా వెల్లడైన జనకాంక్ష**
- **కాంగ్రెస్ సర్కార్‌పై పెల్లుబికిన నిరసన**
- **మంత్రులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల నిలదీతలు**

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): ఊరూరా జనాగ్రహం కట్టలు తెంచుకుంటున్నది. కాంగ్రెస్ సర్కార్ తీరుపై పల్లెలు గర్జిస్తున్నాయి. అనర్హులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వారి అడుగులకు మడుగులొత్తేవారికే సర్కార్ పథకాలా? అంటూ నిరసిస్తున్నాయి. ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించిన గ్రామసభలు సర్కారు పనితీరుకు అద్దంపట్టాయి. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ సహా గ్రామసభల్లో పాల్గొన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ప్రజలు సంధించిన ప్రశ్నల వర్షంతో వణికిపోయారు. మరోవైపు ప్రజల పక్షాన నిలదీసిన ప్రతిపక్ష ఎమ్మెల్యేలను, నిరసన తెలిపిన ప్రజలను అధికార పార్టీ ఎమ్మెల్యే సహా కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడులు చేసి, బెదిరింపులకు గురిచేయటం వంటి సంఘటనలూ చోటుచేసుకున్నాయి. మొత్తంగా కాంగ్రెస్ సర్కార్‌పై గ్రామసభల సాక్షిగా పల్లెలు తిరగబడుతున్నాయని తేటతెల్లమైంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధికోసమే కాంగ్రెస్ పార్టీ లబ్ధిదారుల ఎంపిక పేరుతో డ్రామాలు ఆడుతుందని ప్రజలు నిర్ధారణకు వచ్చారు.

గ్రామాల్లో నిలదీతలు

ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన గ్రామసభలు రసాభాసగా మారాయి. ప్రభుత్వం ఆదివారం ప్రారంభించనున్న నాలుగు పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన గ్రామసభల సాక్షిగా కాంగ్రెస్ సర్కార్ తీవ్ర నిరసను ఎదుర్కొన్నది. ప్రభుత్వ పథకాలు అనర్హులకు అప్పగిస్తున్నారని, అందుకు ప్రభుత్వం సిద్ధం చేసిన జాబితాలే నిదర్శనమని వేలాది గ్రామాల్లో ప్రజలు మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 800 గ్రామాల్లో కాంగ్రెస్ సర్కార్ ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వచ్చింది. ఆ నిరసన ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే అధికంగా వ్యక్తమైంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గంలో ఒకరు, జగిత్యాల జిల్లాలో మరొకరు ఆత్మహత్యయత్నానికి పాల్పడి సర్కార్‌పై తమ నిరసనను వ్యక్తం చేయటం విచారకరం. కొన్నిచోట్ల సెల్‌టవర్లు ఎక్కగా, పలువురు గ్రామపంచాయతీ కార్యాలయం ముందు నిరసన వ్యక్తంచేశారు. గ్రామసభలు సాగిన ప్రాంతాల్లో పోలీసులు ముందస్తు బందోబస్తు ఏర్పాటుచేశారు. పలు చోట్ల లబ్ధిదారుల కన్నా పోలీసులే అధికంగా కనిపించినా, సభ నిర్వహణను వీడియోగ్రఫీ చేసినా ప్రజలు ఎక్కడా తమ నిరసనను విరమించుకోలేదు.

మంత్రులకు నిరసన సెగ

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ గ్రామసభలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఆంథోల్ నియోజకవర్గం నేరెడుగుంటలో మంత్రి దామోదర రాజనర్సింహ, ఇతర చోట్ల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే కంభంపాటి అనిల్‌కుమార్, వినోద్ తదితర ప్రజాప్రతినిధులు గ్రామసభల్లో ప్రజాగ్రహానికి గురయ్యారు. దీంతో ఆంథోల్ నియోజకవర్గంలోని నేరేడుగుంట గ్రామంలో 350 మందికి రుణమాఫీ జరగాల్సి ఉన్నప్పటికీ ఇంకా 127 మందికి పైగా రైతులకు రుణమాఫీ జరగాల్సి ఉంది అని ప్రకటించారు.

గులాబీ దళం-ప్రజల పక్షం

గ్రామసభల సందర్భంగా ప్రభుత్వాన్ని నిలదీసిన వారిపై స్థానిక కాంగ్రెస్ నాయకులు, కొన్నిచోట్ల పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి వారి నోరునొక్కే ప్రయత్నం చేయగా, బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు వారికి అండగా నిలిచారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. అయినా సరే గులాబీ దళం ప్రజలపక్షం వహించిందని గ్రామసభలు మరోసారి నిరూపించాయి. హన్మకొండ జిల్లా కమలాపూర్ నియోజకవర్గంలో గ్రామసభకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వస్తున్నారని తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు తమ వెంట కోడిగుడ్లను, టమాటాలను తెచ్చుకొని దాడికి పాల్పడ్డారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని 'గ్రామసభల్లో గొడవచేస్తే, తోలుతీసి... చెట్టుకు కట్టేసి కొడ్తాం బిడ్డల్లారా' అని హెచ్చరికలు జారీ చేశారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, వారి అనుయాయులు చేసిన హూంకరింపులు, బెదిరింపులకు భయపడకుండా అన్నివేళలా అండదండగా ఉంటామని బీఆర్‌ఎస్ నిరూపించింది.

తీవ్ర నిరసనల చిట్టా..

రాష్ట్రవ్యాప్తంగా అన్ని చోట్ల, అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని నాలుగు రోజుల గ్రామసభలు తేటతెల్లం చేశాయి. ఉమ్మడి జిల్లాల వారీగా నిరసన వ్యక్తమైన ఘటనల వివరాలు..

జిల్లా	తీవ్ర ఆందోళనల సంఖ్య
కరీంనగర్	45
ఆదిలాబాద్	69
వరంగల్	68
నిజామాబాద్	107
మహబూబ్‌నగర్	86
ఖమ్మం	84
నల్గొండ	139
మెదక్	130
హైదరాబాద్	26
మొత్తం	754

కేసుల మాఫీ కోసం కాదు రాజీనామా!

- **నేటి రాజకీయాల్లో ఇమడలేకనే వైదొలగుతున్నా**
- **వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి**

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): బీజేపీ, కూటమి ఇచ్చే పదవుల కోసమో, కేసుల మాఫీ కోసమో రాజీనామా చేయలేదని, ప్రస్తుత రాజకీయాల్లో ఇమడలేక, పదవికి న్యాయం చేయలేకే వైదొగులుతున్నానని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి చెప్పారు. తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌తో అన్ని విషయాలు మాట్లాడిన తరువాతనే రాజీనామా చేసినట్టు తెలిపారు. త్వరలోనే పార్టీ నుంచి కూడా వైదొలగనున్నట్టు వెల్లడించారు. రాజ్యసభ చైర్మన్‌కు రాజీనామా లేఖ అందజేసిన అనంతరం శనివారం ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. నాలుగు దశాబ్దాలుగా వైఎస్ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెప్పారు. ఏనాడూ పార్టీతో విభేదించలేదన్నారు. తానేదో అక్రమాలకు, అవినీతికి పాల్పడ్డానని ఆంధ్రజ్యోతి, ఈనాడు లాంటి కొన్ని మీడియా సంస్థలు తనపై దుష్ప్రచారం చేశాయని వ్యాఖ్యానించారు. తన రాజీనామాతో కూటమికి లబ్ధి చేకూరుతుందనే విషయం తెలిసే వైదొలిగానని స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీకి చెందిన మరో రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి కూడా రాజీనామా చేసే యోచనలో ఉన్నట్టు తెలిసింది. ఆయన కూడా రిజైన్ చేస్తే రాజ్యసభలో వైసీపీ ఎంపీల సంఖ్య ఆరుకు తగ్గనున్నది.

అధికారుల అర్ధరాత్రి సర్వేలు

- **ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉరుకులు పరుగులు**

ఆదిలాబాద్/కరీంనగర్(నమస్తే తెలంగాణ)/వికారాబాద్/ఖమ్మం రూరల్/జనగామ చౌరస్తా/ముదిగొండ, జనవరి 25 : గణతంత్ర దినోత్సవం రోజున నాలుగు పథకాలను అట్టహాసంగా ప్రారంభిస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం అమలు విషయంలో యూటర్న్ తీసుకున్నది. మండలానికి ఒక్క గ్రామాన్ని ఎంపిక చేసి నాలుగు పథకాలను పైలట్‌గా అమలుచేయాలని నిర్ణయించింది. దీంతో ఆయా గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక అధికారులకు తలనొప్పిగా మారింది. కొత్తగా వచ్చిన దరఖాస్తులను మళ్లీ పరిశీలించాల్సి వచ్చింది. రాత్రికి రాత్రి ఎంపిక చేయాల్సి రావడంతో అధికారులు ఉరుకులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు నానాహైరానా పడుతూ ఇంటింటికీ తిరిగి పరిశీలన చేపట్టాల్సి వచ్చింది. శనివారం ఆయా గ్రామాల్లో చేపట్టిన సర్వేలు అర్ధరాత్రి వరకు కొనసాగినట్టు సమాచారం. కొన్ని గ్రామాల్లో గ్రామపంచాయతీ కార్యాలయాలు, కాంగ్రెస్ నాయకుల ఇండ్లల్లో కూర్చొని సర్వేలు చేసినట్టు తెలిసింది. ఖమ్మం రూరల్ మండలం ఆరెంపులలో 79 మందిని ఇందిరమ్మ ఇండ్లకు, 62 మందిని రేషన్‌కార్డుల కోసం, 134 మందిని ఆత్మీయ భరోసాకు, 614 మందిని రైతుభరోసాకు అర్హులుగా గుర్తించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం అనంతారం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన అధికారులు ఆదివారం వైరా ఎమ్మెల్యే చేతుల మీదుగా అర్హులకు మంజూరుపత్రాలు అందించనున్నారు. వికారాబాద్ జిల్లా దోమ మండల కేంద్రంతోపాటు ఉమ్మడి మెదక్ జిల్లాలో అధికారులు రాత్రిపూట సర్వేచేసి వివరాలను ఉన్నతాధికారులకు పంపించారు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని సాల్వాపూర్, చిల్పూర్‌గార్లగడ్డతండా (ఫత్తేపూర్), దేవరుప్పుల మండలంలో లకావత్‌తండా(మాదాపురం), స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో తానేదార్‌పల్లి, జనగామ మండలంలో ఎర్రకుంట తండా(పెద్దపహాడ్), కొడకండ్లలో నీలిబండ తండా(మొండ్రాయి), లింగాలఘనపురంలో కొత్తపల్లి, నర్మెటబొమ్మకూర్, పాలకుర్తి తీగారం, రఘునాథపల్లి కన్నాయపల్లి, తరిగొప్పులలో వాచ్యాతండా(అంకుషాపూర్), జఫర్‌గడ్‌లో అల్వార్‌బండతండా(శంకర్‌తండా)ను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్టు కలెక్టర్ తెలిపారు. రాత్రిపూట అధికారులు గ్రామాల్లోకి రావడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికే గ్రామాల్లో గ్రామసభలు పెట్టి లబ్ధిదారుల జాబితా ప్రకటించగా, మళ్లీ సర్వే ఏంటని ప్రశ్నించడం కనిపించింది.

పైలట్ గ్రామం ఎంపికలో వాగ్వాదం..

ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం బాణాపురం గ్రామాన్ని తొలుత పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేయగా అధికారులు సర్వే చేపట్టారు. రెండు గంటలపాటు సర్వే తర్వాత మరో గ్రామం ఎంపిక చేయడంతో మా ఊళ్లో సర్వే చేసి ఇప్పుడు మరో ఊరు అంటారా? అని అధికారులతో గ్రామస్థులు వాగ్వానికి దిగారు. ఆగ్రహంతో గ్రామపంచాయతీ కార్యాలయం గేటుకు తాళం వేశారు. చేసేది లేక ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వగా తర్జనభర్జనల అనంతరం మార్పు ఏమీ లేదని, మీ గ్రామాన్నే ఎంపిక చేస్తున్నామని చెప్పడంతో గ్రామస్తులు శాంతించారు. ఇది డిప్యూటీ సీఎం భట్టి నియోజకవర్గం కావడంతో చర్చనీయాంశమైంది.



ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కుచులాపూర్‌లో సర్వే చేస్తున్న అధికారులు